# స్వామి వారపత్రికానంద ప్రభావం

సీతారామ్రావ్‌కు గత ఆరునెలల బట్టీ ఆరోగ్యం చెడిపోయింది. క్రమంగా క్రక్రమంగా అక్రమంగా లావెక్కడం మొదలుపెట్టాడు. హఠాత్తుగా ఒకరోజు బరువు చూసుకుంటే రెండువందల పౌన్లు తూగాడు. అతనికి విపరీతమైన భయం వేసింది. వెంటనే ఆలోపతివైద్యం మొదలుపెట్టాడు. కాని మూడువారాల తర్వాత కూడా ఏమీ ఫలితం కనిపించ లేదు. "ఆలోపతీ" వొద్దు "అలిపతి" ప్రయత్నంచేయండి అన్నారు కొందరు మిత్రులు. "అలిపతి" (రోజు భార్యతో కులాసాగా ...... పూర్తిగా చెప్పను.) తర్వాత "ఉమాపతి" కూడా వాడి చూశాడు. ఫలితం కనిపించలేదు. "ఉమాపతి" నుండి సీతారామ్రావ్ యునానీకి వెళ్ళాడు. ఆరువారాలు గడిచాయి. సీతారామ్రావ్ బరువు పెరుగుతున్నది కాని తగ్గడంలేదు.

ఆఖరుకు ప్రాణం విసిగి దగ్గరగా వున్న నదిలో దూకేద్దామని వెళ్ళాడు సీ. రా. రావ్. అతను దూకబోతూ ఉంటే "ఆగవయ్యా ఆగు" అని వెనకనుంచి ఒక కంఠం వినిపించింది. సీ. రా. రా. వెనక్కి తిరిగిచూశాడు. స్వామీ వారపత్రికానంద పెద్ద గడ్డంతో అక్కడ నిలబడివున్నాడు. "నాతో రా నాయనా" అని ఆయన ఎంతో ఆదరంగా సీ.రా.రా ను తనతో తీసుకువెళ్ళి ఒక ఆశ్రమంలో కూర్చోపెట్టాడు. ఆ ఆశ్రమంలో సీ. రా. రా. పదిరోజులు వున్నాడు. అతను బయటకురాగానే మళ్ళీ జనంలో పడగానే అతన్ని ఎవరూ పోల్చుకోలేక పోయారు. అతని భార్యకు మూర్ఛ వొచ్చినంత పనయింది అతని బక్కదనాన్ని చూసి. స్నేహితులంతా అతనికి కంగ్రాట్స్ చెప్పారు. "ఏ మందు వాడావు" అని అడిగారు.

సీ. రా². చిరునవ్వు నవ్వాడు. "నేను స్వామివారు ఇంత గొప్పవారనుకోలేదు. రోజూ స్నానంచేశాక నన్ను కూర్చోబెట్టి కొన్ని తెలుగు వారపత్రికలు చదివి వినిపించారు. ఆధునిక నవలలూ, కథలూ, కవితా అన్నీ విన్నాను. రోజురోజుకూ బరువు తగ్గడం మొదలుపెట్టింది. మొత్తం నాలుగేళ్ళపత్రికలు వారు చదివి ముగించిన తరువాత నా బరువుచూశారు. ఆశ్చర్యం ఎంతో తగ్గింది. స్వామీ వారపత్రికానందఎంతో గొప్పవారు" అన్నాడు సీతారామ్రావ్.

"గోపశ్రీ"